క్లుప్తంగా

ఇష్టానుసారంగా..


రోడ్డుపై ఆటోలు

పొదలకూరు: కొందరు ఆటోలను రోడ్లపై ఇష్టానుసారంగా నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. నిత్యం పదుల సంఖ్యలో ఆటోలు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చి మెయిన్ రోడ్లపై నిలుపుతుండటంతో పాదచారులే కాక ఇతర వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో కొందరు డ్రైవర్లు అడ్డదిడ్డంగా ఆటోలను తిప్పుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

విద్యార్థులకు అవగాహన



వెంకటాచలం: మండలంలోని అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు బుధవారం వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని నెల్లూరు సౌత్ ట్రాఫిక్ ఎస్సై హరికృష్ణ తెలిపారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను అగ్నిమాపక శాఖ అధికారి వేణుగోపాలరావు వివరించారు.

ప్రసన్న పరామర్శ



కోవూరు: మండలంలోని లేగుంటపాడుకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత గంపా జగన్నాథరావు తండ్రి పెంచలయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. ఈ క్రమంలో గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉత్తరక్రియలకు మాజీ మంత్రి, పార్టీ అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జెడ్పీటీసీ శ్రీలత, మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, స్వర్ణా వెంకయ్య, మండల ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, జెట్టి శ్యామ్‌సుందర్‌రెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, బల్లి వెంకయ్య, ఇనమడుగు సర్పంచ్ ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు


స్తంభాల ఏర్పాటు

కొడవలూరు: స్థానిక దళితవాడలో ఎనిమిది విద్యుత్ స్తంభాలతో నూతన లైన్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. డీఈఈ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఏఈ రాములు నేతృత్వంలో పనులు చేపట్టారు. కోవూరు వెంకీ, మురళీకృష్ణ, పవన్‌కుమార్, రమణయ్య, చెన్నయ్య, మస్తాన్ సహకారం అందించారు.

చెన్నకేశవస్వామికి అశ్వవాహనసేవ



ఇందుకూరుపేట: కొమరికలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి అశ్వవాహనసేవను మంగళవారం అర్ధరాత్రి నిర్వహించారు. స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

హుండీ కానుకల లెక్కింపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ ఏడాది ఫిబ్రవరి పది నుంచి బుధవారం వరకు కానుకల రూపంలో భక్తులు రూ.25,37,051 మేర సమర్పించారని చెప్పారు. యూఎస్ డాలర్, సౌదీ రియాళ్లను సమర్పించారని ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి వివరించారు. దేవదాయ శాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్, పూడిపర్తి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్‌నాయుడు, ఆలయ ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ సాగే మేలు




పొదలకూరు మండలంలో నిమ్మతోటలు

- మెట్ట ప్రాంతంలో రైతుల ఆసక్తి
- జిల్లాలో 20 వేల హెక్టార్లలో..
- యార్డు ఉండటంతో ఎంతో ఉపయోగం
- నిత్యం 20 లారీల్లో ఎగుమతులు
- సాగు విస్తీర్ణం పెంపునకు సిద్ధం

పొదలకూరు: మెట్ట రైతులకు నిమ్మ సాగు ద్వారా భరోసా లభిస్తోంది. జలయజ్ఞంలో భాగంగా దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాంతంలో కాలువలను తవ్వించడం వల్ల తోటలకు నీటి వసతి పెరిగింది. ఇక్కడ నిమ్మ మార్కెట్ యార్డు ఉండటంతో కాయలు అమ్ముకోవడం రైతులకు అనుకూలంగా మారింది. చాలామంది ఇతర పంటల దిగుబడితో పోల్చి చూసుకుని నిమ్మ సాగే లాభదాయంగా ఉందంటున్నారు. ధరల ఆటుపోట్లు ఉన్నా నిమ్మకు మినిమం గ్యారెంటీ ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఫలితంగా రైతులు ఇప్పుడు సాగు విస్తీర్ణాన్ని పెంపొందించుకునేందుకు సిద్ధపడుతున్నారు. తొలగించిన తోటల స్థానంలో తిరిగి మొక్కలనే నాటేందుకు ఆసక్తి చూపుతున్నారు. చాలామందికి నిమ్మసాగే ప్రధాన పంటగా మారింది. తోటలను నరికి వంట చెరకుగా మార్చిన వారు ప్రస్తుతం వందలాది ఎకరాల్లో సాగుకు ప్రయత్నిస్తున్నారు. ఒక్క పొదలకూరు ప్రాంతంలోనే 3,300 హెక్టార్లలో నిమ్మసాగు ఉంది.

విస్తరించిన మార్కెట్

నిమ్మకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ ఏర్పడటం రైతులకు కలిసొచ్చే అంశమైంది. ఢిల్లీ మార్కెట్ నుంచి విదేశాలకు సైతం ఎగుమతి జరుగుతోంది. అంతే కాకుండా ఉత్తర భారతదేశం నుంచి నిమ్మ పరిశోధనలు జరుపుతున్న శాస్త్రవేత్తలు యార్డుకు రావడమే కాక, తోటలను సైతం పరిశీలించి నిమ్మలో ఔషధ గుణాలతో పాటు, దాని మార్కెట్‌ను ప్రచారం చేస్తున్నారు. నిమ్మ మార్కెట్ విస్తరించి ధరలు పెరుగుతుండటంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. దీంతో వరి సాగును తగ్గించి మెట్ట పంటైన నిమ్మపైనే ప్రధానంగా ఆధారపడుతున్నారు. వేసవి కాలంలో గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డు నుంచి సీజన్‌లో ప్రతనిత్యం 20 లారీలు ఉత్తర, దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.


యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

కేంద్రం ప్రోత్సాహం

నిమ్మ తోటల సాగును కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఉద్యాన పంటల సాగు కిందకు వచ్చే నిమ్మను కొత్తగా సాగు చేస్తే హెక్టార్లకు రూ.50 వేలు రాయితీని అందజేస్తున్నట్టు ప్రకటించారు. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులను భరిస్తోంది. ఉద్యాన శాఖ పునరుద్ధరణ పథకం కింద ముదురు తోటలను తొలగించి మొక్కలను నాటుకున్నా రాయితీలు అందుతాయి. ఇంకా మహాత్మాగాంధీ జాయితీ ఉపాధి హామీ పథకంలో కూడా చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహం లభిస్తోంది. ఎకరాకు ఏడాదికి రూ.50 వేల వరకు అందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలు పది ఎకరాల్లోపు, ఓసీ, బీసీలు ఐదెకరాల్లోపు సాగు చేసుకుంటే రాయితీలను అందజేస్తున్నారు. సేద్యం ఖర్చులను కూడా ఉపాధి హామీలో పంపిణీ చేస్తున్నారు.

ఆధారపడ్డారు



ఎన్ని పంటల సాగు చేసినా అలవాటు పడిన నిమ్మ సాగే మేలుగా ఉంది. ఏడాది పొడవునా రైతులకు ఎంతో కొంత ఆర్థికంగా ఆదుకునేందుకు అవకాశం ఉంటుంది. కనుక ఈ ప్రాంత రైతులు నిమ్మపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

– పెంచల నారాయణరెడ్డి, రైతు, అంకుపల్లి

మార్కెట్ పెరిగింది



నిమ్మ మార్కెట్ దేశంలో బాగా పెరిగింది. యార్డు నుంచి దేశవ్యాప్తంగా ఎగుమతులు ఉన్నాయి. ధరల్లో తరచూ వ్యత్యాసం ఉన్నా రైతులకు దాదాపుగా గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ధరలు బాగా ఉంటాయి.

– ఎం.బాలకృష్ణారెడ్డి, నిమ్మ మార్కెట్ వ్యాపారి, పొదలకూరు

సదస్సులు నిర్వహిస్తాం



త్వరలో నిమ్మపై అవగాహన సదస్సులను నిర్వహిస్తాం. కొత్తగా సాగు చేయాలనే రైతులకు హెక్టార్‌కు రూ.50 వేలు రాయితీలను అందజేయడం జరుగుతుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలు అందాల్సి ఉంది. పొదలకూరు ఉద్యానాధికారి పరిధిలోని మూడు మండలాలకు కలిపి కొత్తగా ఉద్యాన పంటల సాగు 150 హెక్టార్లను లక్ష్యంగా కేటాయించారు.

– ఈ.ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

నీటి పొదుపుపై చిత్రలేఖన పోటీలు



కొడవలూరు: వేసవి శిక్షణ శిబిరాన్ని పురస్కరించుకొని నీటి పొదుపుపై కొడవలూరులోని గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను బుధవారం నిర్వహించారు. తెలుగు కఠిన పదాలపై డిక్టేషన్ పెట్టారు. లైబ్రేరియన్ రాజేశ్వరి మాట్లాడారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయొద్దని కోరారు. శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

వైభవంగా చెన్నకేశవుని రథోత్సవం


రథం లాగుతున్న భక్తులు

చిల్లకూరు: గూడూరు పట్టణం కర్నాలవీధిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. రథం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. మహిళలు దారి పొడవునా కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లకు సత్కారం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్‌కు నూతనంగా నియమితులైన డైరెక్టర్లను ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ నేతలు బుధవారం సత్కరించారు. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్, ఆపరేషన్ డైరెక్టర్ గురవయ్యను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలు ఎస్సెమ్ బాషా, అల్తాఫ్ సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు నవాజ్‌జానీ, రియాజ్, దిల్దార్, జక్రియా తదితరులు పాల్గొన్నారు.

సహకార చట్టాలకు అనుగుణంగా పనిచేయాలి


మహిళా సంఘ సభ్యులకు సర్టిఫికెట్ల ప్రదానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సహకార చట్టాలకు అనుగుణంగా జిల్లాలోని సహకార సంఘాలు విధులు నిర్వర్తించాలని డీసీఓ గుర్రప్ప పేర్కొన్నారు. కందుకూరు డివిజన్ చిన్నఓగూరు సంఘ బంధం, గ్రామ సమాఖ్య సహకార సంఘ మహిళా సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని డీసీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. అనంతరం మ్యాక్స్ పొదుపు సంఘం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు తదితరాలను అందజేశారు. కార్యక్రమంలో కావలి డివిజనల్ సహకార శాఖాధికారి తిరుపాల్‌రెడ్డి, నెల్లూరు డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు

వెంకటాచలం: మండలంలోని అనికేపల్లి గ్రామానికి చెందిన బొచ్చు బాబ్జీ అనే వ్యక్తి తనను లైంగికంగా వేధిస్తున్నాడని ఆదే గ్రామానికి చెందిన ఓ వివాహిత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి కథనం మేరకు.. బాబ్జీ కొన్నిరోజుల వివాహితను వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు తెలిపి వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రదానం


బుజ్జమ్మ (ఫైల్)

విడవలూరు: స్థానిక రామాలయ వీధికి చెందిన ఇన్నమాల బుజ్జమ్మ (90) బుధవారం మృతిచెందారు. కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు ఆమె నేత్రాలను విడవలూరుకు చెందిన మనసేవా సంస్థ వ్యవస్థాపకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి సహకారంతో నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి దానం చేశారు. ఐ టెక్నీషియన్ సునీల్ సేకరించారు.

'జీవీకే' విద్యార్థులకు అభినందన


కార్తీక

ఇందుకూరుపేట: సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో జీవీకే చిన్మయ విద్యార్థులు విజయకేతనాన్ని ఎగురవేశారని కరస్పాండెంట్ బద్దిపూడి హరిత, ప్రిన్సిపల్ బసివిరెడ్డి తెలిపారు. విద్యార్థులను బుధవారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. కార్తీక 478, పూర్వి 461, రోషిణి, వెంకటసంయుక్త 456 మార్కులను సాధించారని పేర్కొన్నారు.

రెజ్లింగ్ జట్ల ఎంపిక నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రెజ్లింగ్ అండర్ – 17, 23 బాలబాలికల జట్లను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం ఎంపిక చేయనున్నామని రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అజయ్‌కుమార్, నాగేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరులో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో జిల్లా తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు. వివరాలకు 94416 44761 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కూటమి ప్రభుత్వం చేసిందేమీలేదు


మాట్లాడుతున్న చలపతిరావు, చిత్రంలో నేతలు

కోవూరు: ప్రజల నెత్తిన అప్పుల భారం మోపడం మినహా కూటమి ప్రభుత్వం చేసిందేమీలేదని డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు ధ్వజమెత్తారు. నెల్లూరులోని నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తూ మోసపూరిత హామీలతో టీడీపీ గెలుపొందిందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలవుతున్నా, హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పటికే రూ.1.46 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. హామీలను సంపూర్ణంగా అమలు చేసిన ఘనత తమ పార్టీకే దక్కుతుందని చెప్పారు. దోచుకోవడం.. దాచుకోవడానికే కూటమి ప్రభుత్వం పరిమితమైందని విమర్శించారు. రాష్ట్రంలో ఎవరైనా బాగుపడ్డారంటే అది చంద్రబాబు, లోకేశ్, పవన్‌కల్యాణేనన్నారు. ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, పార్టీ కోవూరు మండల కన్వీనర్ అత్తిపల్లి అనూప్‌రెడ్డి, మండల కన్వీనర్లు మావులూరు శ్రీనివాసులురెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, చిమటా శేషగిరి, నేత బాలశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు


వెంకటేశ్వరస్వామి దేవస్థానం

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం తృతీయ వార్షిక శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఈనెల 19 నుంచి 15వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను దేవస్థానం నిర్వాహక కమిటీ వేగంగా చేపట్టింది. సుమారు రూ.4 కోట్లతో దేవస్థానాన్ని దాతల సహకారంతో నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ గావించారు. 19న ఉదయం ఉత్సవ ఆరంభం, సాయంత్రం అంకురార్పణ, 20న ఉదయం ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం శేషవాహన సేవ, సామూహిక లక్ష్మీనారాయణ పూజ, 21న ఉదయం సుదర్శన నారసింహ మేష్టి హోమం, సూర్యప్రభ వాహనసేవ, సాయంత్రం హనుమంత వాహనసేవ, 22న ఉదయం గజవాహనం, హంస వాహనం, సాయంత్రం గజవాహన సేవ, 23న ఉదయం కల్పవృక్ష వాహనసేవ, సాయంత్రం అశ్వవాహన సేవ, 24న ఉదయం రథోత్సవం, చక్రతీర్థం, సాయంత్రం పుష్పయాగం, 25న ఉదయం 101 కలశాలతో అభిషేకం ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు.

ఆదమరిస్తే ప్రమాదం


ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

మనుబోలు: మండల పరిధిలోని బద్దెవోలు – కొలనకుదురు రోడ్డులో బద్దెవోలు, కట్టువపల్లి గ్రామాల మధ్యనున్న మలుపు వద్ద కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ కండలేరు ఉపకాలువపై ఉన్న కల్వర్టును చాలాకాలం క్రితం నిర్మించారు. దీని పిట్టగోడ పూర్తిగా కూలిపోయింది. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఇక్కడ ప్రమాదాలు జరిగి ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. సంబంధిత అధికారులు స్పందించి పిట్టగోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకులాల్లో దోమల నివారణ చర్యలు



కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురం గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల, కొడవలూరులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలల్లో దోమల నివారణ చర్యలను స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. గురుకులాల్లోని అన్ని గదుల్లో మలాథియన్‌ను స్ప్రే చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ మాట్లాడారు. దోమల కారణంగా విద్యార్థులకు వ్యాధులొచ్చే అవకాశమున్న తరుణంలో కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. ప్రిన్సిపల్ విష్ణుప్రియ, ఎస్‌యూఓ నాగరాజు, హెచ్‌ఏ షఫీవుద్దీన్, ఏఎన్‌ఎం రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

మినీ ఆటోనగర్‌కు భూమి పూజ

కోవూరు: ఇనమడుగు సెంటర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరిట ఏర్పాటు చేసుకున్న మినీ ఆటోనగర్ నిర్మాణానికి సంబంధించిన భూమి పూజను బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడారు. ఆటోనగర్‌లో కార్మికుల కోసం వాటర్ ప్లాంట్‌ను వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. లక్కీ డిప్ ద్వారా 65 మంది మెకానిక్, లేత్, వెల్డింగ్ తదితర కార్మికులకు షాపులను కేటాయించారు. పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ట్రాన్స్‌కో ఈఈ రమేష్‌చౌదరి, తహసీల్దార్ నిర్మలానందబాబా, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, టీడీపీ కోవూరు మండలాధ్యక్షుడు ఇంతా మల్లారెడ్డి, నేతలు జెట్టి మదన్‌రెడ్డి, దారపనేని శ్రీనివాసులునాయుడు, యాకసిరి వెంకటరమణమ్మ, సూరిశెట్టి శ్రీనివాసులు, బీజేపీ నేత రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

18న ఓపెన్ చెస్ టోర్నీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఫన్‌పార్క్ – ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలను గొలగమూడిలోని ఫన్ పార్క్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం నిర్వహించనున్నామని చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్, ఆనంద్‌వింగ్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఫన్ పార్క్ ఎండీ సాయి సౌజన్యంతో పోటీలను నిర్వహించనున్నామని వివరించారు. విజేతలకు ప్రోత్సాహకంగా రూ.లక్ష నగదు, జ్ఞాపికలు, ప్రశంసపత్రాలను అందజేయనున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 200 మందికిపైగా క్రీడాకారులతో పాటు ఫిడే రేటింగ్ గల వారు హాజరుకానున్నారని తెలిపారు. పేర్ల నమోదుకు 97030 49378 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): అపస్మారక స్థితిలో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందారు. పోలీసుల సమాచారం మేరకు.. కొండాయపాళెం గేట్ వద్ద గుర్తుతెలియని సుమారు 30 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో రోడ్డుపై ఈనెల పదిన పడిపోయారు. స్థానికుల సమాచారంతో సదరు వ్యక్తిని 108లో జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందారు. దర్గామిట్ట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 94407 00018, 94403 33191 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా నారద జయంతి



నెల్లూరు(బృందావనం): ఏసీనగర్‌లోని స్వామి వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్లో దేవర్షి నారద జయంతిని సాహితీ సుధా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు జర్నలిస్టులను సత్కరించారు. ముఖ్యవక్తగా సహ ప్రాంత ప్రచార ప్రముఖ్ వాసుదేవరావు హాజరయ్యారు. తొలుత నారద మహర్షి చిత్రపటం వద్ద జ్యోతి ప్రకాశం చేశారు. జిల్లా సంఘచాలక్ బయ్యా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.